సాక్షి
గుంటూరు
ఆదివారం । 2 । జూలై । 2023



మల్లేశ్వరుని సేవలో హైకోర్టు జడ్జి

పెదకాకాని: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం భ్రమరాంబ మల్లేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



శనిత్రయోదశి ప్రత్యేక పూజలు

అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కార్డుదారులకు గోధుమ పిండి

గుంటూరు వెస్ట్: ప్రజల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం బలవర్ధకమైన గోధుమ పిండిని కిలో రూ.16కి అందిస్తుందని జేసీ జి.రాజకుమారి శనివారం తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి కృష్ణానదిలో చేపల వేట నిషేధం

అమరావతి: జిల్లా మత్స్యశాఖాధికారి ఆదేశాల మేరకు నేటి నుంచి మండలంలోని కృష్ణానది పరివాహక గ్రామాలలో నదిలో చేపలవేటపై నిషేధం విధించినట్లు మండల మత్స్యశాఖ పర్యవేక్షకురాలు జి.భాగ్యలత తెలిపారు శనివారం ఆమె మాట్లాడుతూ నదిలో జులై 1వతేదీ నుంచి ఆగస్టు 31వరకు రెండు నెలల కాలం మత్స్య సంపద అభివృద్ధికి, చేపల సంతానోత్పత్తికి అనువైన కాలం కావటంతో వేట నిషేధించామన్నారు. మత్స్యశాఖ సహాయకులు డి.శ్రీనివాసరావు, పి.శివకుమారిల ఆధ్వర్యంలో నిత్యం నిఘా ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపలవేటకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రారంభం



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా గుంటూరు జిల్లాలో వలంటీర్లు శనివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు శనివారం అందజేశారు. లబ్ధిదారుల వేలిముద్రలు, ఐరీష్ ఆధారంగా పెన్షన్లు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాలో శనివారం నాటికి 81.13 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లావ్యాప్తంగా ఈ నెలలో 2,50,490 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.68.82 కోట్లు కేటాయించింది. శనివారం సాయంత్రానికి 2,03,218 మందికి రూ.55.82 కోట్ల నగదు అందజేశారు.

వైఎస్సార్ ఉచిత పంటల బీమా విడుదల

జిల్లాలో 14,542 మంది రైతులకు రూ.4.16 కోట్లు

కొరిటెపాడు(గుంటూరు): వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 2022 ఖరీఫ్‌కు రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు జిల్లాలోని 14,542 మంది రైతులకు రూ.4.16 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాకు సంబంధించి వర్షాధారం కింద పత్తి పంట సాగు చేసిన ప్రత్తిపాడు, ఫిరంగిపురం, మేడికొండూరు, చేబ్రోలు, కాకుమాను మండలాలకు చెందిన 14,542 మంది రైతులు 25,877.62 ఎకరాల్లో పంట నష్టపోయారు. ఈ రైతులు వాతావరణ ఆధారిత బీమా పొందడానికి అర్హులుగా గుర్తించి జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలు ఈ నెల 4వ తేదీవరకు ఆర్బీకేలలో ప్రదర్శిస్తారు. సామాజిక తనిఖీ చేపట్టి రైతుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి 4వ తేదీ సాయంత్రంలోపు ఆన్‌లైన్ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో డీఈఓ పి.శైలజ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియలో హెచ్‌ఎం పోస్టులకు 140 మంది స్కూల్ అసిస్టెంట్లతో పాటు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 280 మంది చొప్పున తరలివచ్చారు. ఆదివారం స్కూల్ అసిస్టెంట్స్ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సీనియార్టీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని డీఈఓ తెలిపారు.





మంత్రి విడదల రజనిని ఘనంగా సత్కరిస్తున్న వైద్యులు, సీనియర్ వైద్యులను సన్మానిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రాణదాతలకు ప్రణామం

- గుంటూరు జీజీహెచ్‌లో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు
- సీనియర్ వైద్యులను సన్మానించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో శనివారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వార్డులో రోగులకు మంత్రి పండ్లు పంపిణీ చేశారు. అక్కడే ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి సందర్శించి, రక్తదాతలతో మాట్లాడారు. అనంతరం డాక్టర్స్ డే వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైద్యులు ఎంతో నిబద్ధతతో పనిచేస్తారని, కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలు అందించారని కొనియాడారు.

మహానేతను స్మరించుకోవాలి..

ఏపీలో డాక్టర్స్ డే నాడు బీసీ రాయ్‌తో పాటు దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని కూడా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యశ్రీ లాంటి ఒక గొప్ప పథకాన్ని తీసుకొచ్చి, దేశానికే ఆ పథకం దిక్సూచీలా చేసిన గొప్ప నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత ఈ దేశంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి విడదల రజిని అన్నారు. నాడు- నేడు కింద ఒక్క గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్ అభివృద్ధికే ఏకంగా రూ.500 కోట్లు కేటాయించామన్నారు. ఇదే గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో గత ప్రభుత్వ హయాంలో సెల్‌ఫోన్ లైట్ల కింద ఆపరేషన్లు చేయాల్సిన దుస్థితి ఉండేదని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులు అన్ని వసతులతో ఉన్నాయని తెలిపారు.



కార్యక్రమానికి హాజరైన వైద్యులు, వైద్య సిబ్బంది

అభివృద్ధి పథంలో గుంటూరు జీజీహెచ్..

గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. జింఖానా ప్రతినిధుల చొరవతో వచ్చే ఏడాది కల్లా జీజీహెచ్‌లో ఎంసీహెచ్ బ్లాక్‌ను పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. సీఐఏ సహకారంతో రూ. 68 లక్షలతో ఇప్పుడు ఉన్న ప్రసూతి విభాగాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. జింఖానా సహకారంతో మరింతగా ఆస్పత్రిని తీర్చి దిద్దుకునేందుకు ప్రణాళిలు రూపొందిస్తామన్నారు. నాట్కో చొరవతో రాష్ట్రంలోనే నాణ్యమైన క్యాన్సర్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురాగలిగామని, పేదలకు పూర్తి ఉచితంగా అత్యుత్తమ వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు.

సీనియర్ వైద్యులకు సన్మానం..

వైద్యరంగంలో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న పలువురు సీనియర్ వైద్యులకు, జీజీహెచ్ అభివృద్ధిలో సహాయ సహకారాలు అందిస్తున్న వైద్యులను ఘనంగా సత్కరించారు. జీజీహెచ్ అభివృద్ధిలో కీలకంగా ఉన్న డాక్టర్ పాదిల ప్రసాద్, డాక్టర్ గంగాలక్ష్మి, నాట్కో ఫౌండేషన్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావుతోపాటు సీనియర్ వైద్యులు బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సుధాకర్, రాజేంద్రప్రసాద్, తారకనాథ్, మద్దినేని గోపాలకృష్ణయ్య, మురళీ బాబూరావు, ఫణిభూషణ్, రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం, కె.ఎస్.ఎన్.చారి, తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తదితరులు మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళ నాయకురాలు ఫాతిమా, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ రమణ యశశ్వి, డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థికే దిక్కులేదు..
భవిష్యత్తుకు గ్యారెంటీనా?

- నేడు ప్రత్తిపాడులో టీడీపీ బస్సుయాత్ర
- ఎస్సీ నియోజకవర్గంలోనూ అగ్రకుల సమన్వయ కర్తే...
- అభ్యర్థి కోసం బయట జిల్లాల్లో వెతుకులాట
- విస్తుపోతున్న నియోజకవర్గ ప్రజలు

సాక్షి ప్రతినిధి,గుంటూరు: ఇంతవరకూ అభ్యర్థి దొరకలేదు... భవిష్యత్తుకు మాత్రం మేం గ్యారెంటీ అంటున్న తెలుగుదేశం పార్టీ నేతలను చూసి నియోజకవర్గ ప్రజలు విస్తుపోతున్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న బస్సు యాత్ర శనివారం తాడికొండ నియోజకవర్గంలో జరిగింది. ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలు మరో పది నెలల్లో ఉన్నా ఇప్పటికీ నియోజకవర్గంలో పోటీ చేసేది ఎవరో తేల్చుకోలేని పరిస్థితి ఉంది. నియోజకవర్గ స్థాయిలో బలమైన నాయకత్వం లేక బయట నుంచి నాయకులను ఎన్నికల వరకు అరువు తెచ్చుకోవాల్సిన దుస్థితిలో టీడీపీ ఉంది. ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో, ఇప్పుడు ఆ పార్టీ చరిత్ర 'గతం'గా మారిపోయింది. ప్రతి ఐదేళ్లకోసారి ఉన్నవారికి పాగబెడుతూ, కొత్త అభ్యర్థులను వెతుక్కుంటూ ఆ పార్టీ అధిష్టానం దిక్కులు చూడాల్సిన పరిస్థితి. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత నియోజకవర్గ సమన్వయకర్తగా చంద్రబాబు తన సామాజిక వర్గానికి చెందిన మాకినేని పెదరత్తయ్యకు బాధ్యతలు కట్టబెట్టారు. ఎస్సీ నియోజకవర్గంలో ఓసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంపై అప్పట్లో పార్టీలోని కొందరు ఎస్సీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎన్నికలకు మరో పది నెలల కాలం ఉండగా మాజీ ఐఏఎస్ అధికారి బి.రామాంజనేయులుకు ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ పార్టీ తరఫున బరిలో నిలిచి అభ్యర్థులు ఓడిన వెంటనే నియోజకవర్గంలో ప్యాకప్ చెప్పేస్తున్నారు. అక్కడ చంద్రబాబునాయుడి సామాజికవర్గం నేతల పెత్తనం తట్టుకోలేక పక్క పార్టీల్లో చేరిపోతున్నారు.

- మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య వైఎస్సార్ సీపీలో చేరి మళ్లీ టీడీపీలోకి వెళ్లారు.
- టీడీపీ నుంచి 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొంది, మంత్రి వర్గంలో స్థానం సంపాదించుకున్న దళితనాయకుడు రావెల కిషోర్ బాబుకు ఆ పార్టీలోని అగ్ర సామాజికవర్గం పొమ్మనకుండా పొగబెట్టారు. దీంతో ఆయన బీజేపీలోకి అక్కడి నుంచి బీఆర్ఎస్‌లోకి జంప్ అయ్యారు.
- 2019లో మరో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను ప్రత్తిపాడు నుంచి బరిలోనికి దింపారు. ఆయన కూడా ఓడిన తరువాత వైఎస్సార్ సీపీలో చేరారు. దీంతో నాలుగేళ్లుగా పార్టీకి నేత లేకుండా పోయారు. ఓడిన తరువాత పార్టీ మారిన వారిద్దరూ స్థానికేతరులే. తాజాగా ఇప్పుడు మరలా స్థానికేతరుడికే ఇన్‌చార్జిగా అధిష్టానం అవకాశం ఇస్తుందన్న వార్తలతో తెలుగు తమ్ముళ్లు నైరాశ్యంలో పడ్డారు.

విభేదాలతో తలబొప్పి..

పార్టీకి కంచుకోటగా ఉన్న వట్టిచెరుకూరు మండలంలో పార్టీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరాయి. మాజీ ఎంపీపీ పూనాటి రమేష్ ఒక వర్గం, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావుది మరో వర్గం. పూనాటి రమేష్ మాకినేని పెదరత్తయ్య నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగంగానే ఆయనకు వ్యతిరేకంగా పనిచేయడంతో మన్నవ వర్గం అధినాయకత్వానికి ఫిర్యాదు చేసింది. దీంతో పూనాటిని పార్టీ సస్పెండ్ చేసింది. దీంతో పూనాటి వర్గం నాలుగైదు బస్సుల్లో వెళ్లి చంద్రబాబును కలిసినప్పటికీ ఫలితం లేకపోయింది. కానీ ఆయన పార్టీకి విధేయుడిగానే ఉంటూ పంటికింద రాయిలా మారారు. ఈ నేపథ్యంలో బస్సు యాత్ర పేరుతో మళ్లీ పార్టీని సమాయత్తం చేసే ప్రయత్నం తెలుగుదేశం నుంచి కనపడుతోంది. అయితే తెలుగుతమ్ముళ్ల మాత్రం ఆసక్తి చూపకపోవడం కొసమెరుపు.

భగవతీ శాకంబరీ..

ప్రకృతిమాతా నమోస్తుతే

- ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం
- దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కమలాసనంపై కూర్చుని తన పిడికిలిలో వరిమొలకలను పట్టుకుని, పుష్పాలు, ఫలాలు, దుంపగడ్డలు ధరించిన శాకంబరీ దేవిగా విశేష అలంకారంలో.. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న భక్తజనం మది పులకించింది. ప్రకృతిమాతా ప్రణామం అంటూ అశేష భక్తజనం శాకంబరీదేవి అలంకారంలో ఉన్న జగజ్జననిని వేడుకున్నారు. భక్తులతో క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలయ్యాయి. ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శనివారం శాకంబరీదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇవి మూడు రోజుల పాటు జరగనున్నాయి. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడుతో పాటు తెలంగాణాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు శాకంబరీదేవిని దర్శనానికి ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఉత్సవాల్లో తొలి రోజు శనివారం సుమారు 70వేల మంది దర్శనానికి వచ్చారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

కలశస్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో కలశ స్థాపనతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. శాకంబరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తుల ఇంట అన్న పానీయాలకు లోటు లేకుండా ఉంటుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. అమ్మవారిని వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో అలంకరించారు. అలయ ప్రాంగణాన్ని కాయగూరలతో ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పలువురు పాలక వర్గ సభ్యులు కట్టా సత్తెయ్య, చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీకృష్ణ, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వేద పండితులు, వైదిక కమిటీ సభ్యులు, ఎఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.



భక్తానంద విధాయిని.. శాకంబరీదేవికి హారతి

పచ్చగా ఆలయ ప్రాంగణం

ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని కరివేపాకుతో కప్పేశారు. దీంతో అమ్మవారి ఆలయం కరివేపాకు తోటను తలపించింది. భక్తులు పచ్చదనం పరిమళాలతో పులకించారు. వంకాయలు, టమాటా, పొట్లకాయలను ఉపయోగించి చేసిన శివపార్వతుల ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

రికార్డు స్థాయిలో భక్తజనం

శాకంబరీదేవి ఉత్సవాలు, ఆషాఢ మాసోత్సవాలు, శనివారం నేపథ్యంలో రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం సుమారు 60 నుంచి 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం కూడా ఇదే స్థాయిలో భక్తుల రద్దీ ఉంటుందని ఆలయ అధికారులు భావిస్తున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని వివిధ రకాల కాయగూరలు,ఆకుకూరలు,పండ్లతో అలకంరించారు.

అద్భుతం.. కదంబం..

శాకంబరీ ఉత్సవాల్లో అలంకరణ చేసిన కూరగాయలతో తయారు చేసే కదంబ ప్రసాదానికి ప్రత్యేకత ఉంది. ఉత్సవాలకు విచ్చేసే భక్తులు అమ్మవారి దర్శనం తర్వాత అడిగేది.. కదంబ ప్రసాదం పంపిణీ ఎక్కడ అనేదే. పలు రకాల కాయగూరలు, ఆకుకూరలతో తయారు చేసే కదంబం ప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. ఈ ప్రసాదాన్ని ఆలయ ఈవో భ్రమరాంబ భక్తులకు పంపిణీ చేశారు.

అత్యంత పారదర్శకతకు 'సురక్ష'

- అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలకు దూరం కాకూడదనే ప్రభుత్వ సంకల్పం
- కార్యక్రమ పర్యవేక్షణకు 5 టాస్క్‌ఫోర్స్ టీంలు, స్పెషల్ ఆఫీసర్లుగా జిల్లాస్థాయి అధికారులు
- 'జగనన్న సురక్ష' క్యాంప్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): ప్రజల వద్దకే అత్యంత పారదర్శకంగా పరిపాలన తీసుకువచ్చే గొప్ప కార్యక్రమం 'జగనన్న సురక్ష' అని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. సచివాలయంతో పాటు సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. క్యాంప్‌లో ఉచితంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతు కార్డులు అందించారు. అనంతరం జెడ్పీ సీఈఓ మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపానలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, పరిపాలనను వికేంద్రీకరణ చేస్తూ ప్రజలకు మరింత దగ్గరగా తీసుకురావాలనే ఉద్దేశ్యంతో 2019 ఆగస్టులో వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. మూడు మాసాలు నిండకముందే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, మెరిట్ ఆధారంగా పూర్తి పారదర్శకంగా సచివాలయ ఉద్యోగులను నియమించారన్నారని చెప్పారు. క్యాంప్ జరిగే గ్రామంలో వారం ముందే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ తిరిగి సర్వే చేసి అర్హత ఉండీ పథకాలు అందని వారిని గుర్తించి దరఖాస్తు చేసి టోకెన్లు ఇస్తారని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, వ్యవసాయ సీజన్ కావడంతో సీసీఆర్సీ కార్డులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఆధార్, రేషన్‌కార్డు సమస్యలను పూర్తి ఉచితంగా సేవలు అందించనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఈరోజు 52 సచివాలయాల్లో సురక్ష కార్యక్రమం జరుగుతుందని, పర్యవేక్షణ, లోపాలను సరిచేసేందుకు 5 టాస్క్‌ఫోర్సులు, జిల్లాస్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా కూడా నియమించామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు పద్మావతి, జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీటీసీ తమ్మా రమాదేవి, కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి, డీఎల్‌డీఓ సుజాత, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ శ్రీరమ్య, తహసీల్దార్ సిద్ధార్థ, ఏపీఎం సురేష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతుకార్డులను అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వేదికపై సర్పంచ్ పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, ఎంపీపీ అన్నమ్మ

జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా సువార్త



లక్ష్మీపురం: జిల్లా విభిన్న ప్రతిభావంతుల కార్యాలయ ఏడీ సువార్తకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ జిల్లా జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సువార్త జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టారు. సువార్త మాట్లాడుతూ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయ పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ప్రధానంగా మైనార్టీ ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ బాలికల వసతి గృహాల్లో వసతుల మెరుగునకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రీ మెట్రిక్ వసతి గృహంలో 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పోస్టు మెట్రిక్ వసతి గృహంలో ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.

పెదకాకాని వద్ద బైకును ఢీకొన్న కారు

భార్య మృతి.. భర్తకు గాయాలు


సంఘటనా స్థలంలో భారతి మృతదేహం

పెదకాకాని: ఆసుపత్రిలో బంధువును పరామర్శించి ఇంటికి వెళ్తుండగా, బైకును కారు ఢీకొన్న సంఘటనలో భార్య మృతి చెందగా, భర్త గాయాలైన సంఘటన పెదకాకాని వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ అజిత్‌సింగ్ నగర్ వాంబే కాలనీకి చెందిన నందిగం వాణిరెడ్డి, భార్య భారతితో కలసి బైక్‌పై శనివారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమీప బంధువును పరామర్శించేందుకు బయలుదేరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాణిరెడ్డి బాబాయ్ కలపాల సంతోష్‌ను పరామర్శించి తిరిగి ఇంటికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బైక్ సర్వీసు రోడ్డులో పెదకాకాని సెంట్రల్ వేర్ హౌస్ సమీపంలో చేరుకునేసరికి వెనుక నుండి వేగంగా వచ్చిన కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో బైక్‌పై వెనుక కూర్చుని ఉన్న భారతి(36) తలకు బలమైన దెబ్బ తగిలి చెవులు, ముక్కు వెంట రక్తస్రావమై సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. బైక్ నడుపుతున్న నందిగం వాణిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని గుంటూరు మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త వాణిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్ బాబు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జేసీ తదితరులు


వెంకటపాలెంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడేపల్లి రూరల్ : ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి , ప్రతి ఒక్కరికీ గ్రామంలోనే సేవలు అందిస్తున్నారని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఎంటీఎంసీ కమిషనర్ శారదా దేవి, తాడేపల్లి-మంగళగిరి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, రామ్‌ప్రసాద్ అర్హులైన వారికి సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొలనుకొండలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే ముందు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలసికట్టుగా వారం రోజుల పాటు 1334 నివాసాలకు తిరిగి సర్వే చేశారన్నారు. మొత్తం 361 మంది వివిధ సర్టిఫికెట్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో 341 మందికి పత్రాలు అందజేసినట్లు చెప్పారు. 20 మంది జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారని, అవి ఇక్కడ ఇచ్చేందుకు అవకాశం లేదని తెలిపారు. ఆ ప్రాంతంలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లో ఫోన్‌కు మెసేజ్ వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ జగనన్న సురక్ష స్పెషల్ ఆఫీసర్ మధుసూదనరావు, సచివాలయ సెక్రటరీ ఎం.ఎల్.వి. ప్రసాద్, తాడేపల్లి రూరల్ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, తాడేపల్లి పట్టణ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు, కొలనుకొండ కన్వీనర్ వెంకటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, పార్టీ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

తాడికొండ: జగనన్న సురక్ష పథకం ద్వారా కుల మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమం అందనుందని ప్రభుత్వ సలహాదారు, నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం వెంకటపాలెంలో కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తుళ్లూరు మండలం నెక్కల్లు శిబిరంలో 553 మందికి, వెంకటపాలెంలో 621 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. తాడికొండ మండలం పాములపాడులో 306, లాంలో 461 సర్టిఫికెట్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నూతన షోరూం ప్రారంభం


షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి మృణాల్ ఠాకూర్

పాత గుంటూరు: గుంటూరు జిన్నా టవర్ సెంటర్‌లో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నూతన షోరూం శనివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ప్రముఖ సినీతార సీతారామం ఫేమ్ మృణాల్ ఠాకూర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్య అతిథిగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు పాల్గొని షోరూంను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ షేక్ సజీలా, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, కార్పొరేటర్ షేక్ ఖాజా మొహినుద్దీన్ చిష్టి పాల్గొన్నారు. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ గుంటూరులో సరికొత్తగా ప్రారంభించిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో అందరినీ అలరించే అద్భుతమైన కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివాహ సీజన్లు, పండుగల సందర్భంలో ప్రజలు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ షోరూంను సందర్శించాలని ఆమె సూచించారు. మాల్ డైరెక్టర్ సురేశ్ సీర్ణ అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. డైరెక్టర్లు అభినయ్, రాకేశ్, కేశవ్ మాట్లాడుతూ మాల్‌లో లభించే ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పోచంపల్లి, గద్వాల్ వంటి వెరైటీల పట్టు కలెక్షన్లు, ఆషాఢం, శ్రావణం, సేల్స్, నూతన కలెక్షన్లు, షోకేస్డ్ డిజైన్లు, చుడీదార్, లెహంగాస్, గౌన్స్, కిడ్స్‌వేర్, లేడీస్ వెస్ట్రన్‌వేర్, కిడ్స్‌వేర్, లేడీస్ వేర్‌లోని ప్రత్యేకతల్ని వివరించారు. వినూత్న షాపింగ్ అనుభూతిని ఆశించే కస్టమర్లకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నగరంలో రెండో షోరూం స్వాగతం పలుకుతుందని పేర్కొన్నారు.

జోస్ ఆలుక్కాస్ నూతన షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న బిగ్‌బాస్ టీం సుల్తానా, మద్దాళి గిరిధర్

పాత గుంటూరు: గుంటూరు బ్రాడీపేటలో జోస్ ఆలుక్కాస్ నూతన షోరూం శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి షోరూంను ప్రారంభించారు. కార్యక్రమంలో అఖండ ఫేమ్ కీర్తన, బిగ్‌బాస్ ఫేమ్ ఇనయా సుల్తానా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా మంచి డిజైన్లు, క్వాలిటీ ఆభరణాల్ని అందిస్తున్న జోస్ ఆలుక్కాస్ యాజమాన్యాన్ని అభినందించారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ పాల్ జె. ఆలుక్కా మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ వరకు ఆభరణాలను కొనుగోలు చేసేవారికి ప్రత్యేక బహుమతితో పాటు, రూ. 50 వేలకు పైగా కొనుగోలు చేసేవారికి బంగారు నాణెం బహుమతిగా ఇస్తున్నట్లు తెలిపారు. వివాహ కొనుగోళ్లకు ప్రత్యేక తగ్గింపుతో పాటు వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై 2 శాతం తగ్గింపు పొందవచ్చని చెప్పారు.కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ జాన్, షోరూం మేనేజర్ వినోద్, అసిస్టెంట్ మేనేజర్ శివ, షేక్. బాబు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో

ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన

నడింపాలెం (ప్రత్తిపాడు): మండల పరిధిలోని రెండు గ్రామాల్లో శనివారం పన్నెండు మందితో కూడిన ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటించింది. శిక్షణలో భాగంగా తొలుత నడింపాలెం పంచాయతీలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటరును పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ఖాజాతో పాటు గ్రీన్ అంబాసిడర్లు మస్తానమ్మ, అంజమ్మతో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్తల సేకరణ, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ, చెత్త నుంచి సంపద సృష్టి, ఇంటింటికీ చెత్త సేకరణలో ప్రజల భాగస్వామ్యం గురించి తెలుసుకున్నారు. అనంతరం నిమ్మగడ్డవారిపాలెంలో అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన రక్షిత మంచినీటి చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధికి తీసుకున్న చర్యలను డ్వామా జాయింట్ కమిషనర్ శివప్రసాద్ కలెక్టర్ల బృందానికి వివరించారు.